రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త



# సమయము లేదు మిత్రమా..




## నోటిఫికేషన్ విడుదలతో స్పీడ్ పెంచిన షాద్‌నగర్ కాంగ్రెస్
## అభ్యర్థుల ఎంపికకు ముమ్మర కసరత్తు -గెలుపు గుర్రాల కోసం వేట
## సిఫార్సులు.. బల ప్రదర్శనకు నోఛాన్స్ - పనితీరును బట్టే టికెట్
## ఆశావహులకు నామినేటెడ్ పదవుల ఆశ - గత ఎన్నికలలో కేవలం
## 2 వార్డులకే పరిమితం - ఈసారి 21 టార్గెట్

**షాద్‌నగర్, జనవరి 27, ప్రభాతవార్త :** ఎన్నికలు అనగానే బడాబడా నాయకులతో సిఫార్సులు.. కార్యకర్తలతో బల ప్రదర్శనలు.. అగ్ర నాయకుల చుట్టూ ప్రదక్షణలు సర్వసాధారణం.. ఈ మున్సిపాలిటీ ఎన్నికలు కూడా ఇందుకు అతీతం కాదు.. అయితే గెలుపు గుర్రాలను పట్టి.. చైర్మన్ పీఠంపై గురిపెట్టి.. మున్సిపాలిటీ అయ్యాక జరుగుతున్న మూడోసారి ఎన్నికల్లో 21తో సిరీస్‌ను కొట్టడానికి కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అటు సిఫార్సులకు, ఇటు బల ప్రదర్శనలకు దూరంగా సర్వేల ద్వారా అభ్యర్థులను తెరపైకి తెచ్చేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్నాహాలు చేస్తున్నారు. మంగళవారం మున్సిపల్ నోటిఫికేషన్ విడుల అనంతరం షాద్‌నగర్ మున్సిపాల్టీలో రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది.

**ఇదీ ఆశావహుల లెక్క..**

ఎన్నికలు అనగానే సహజంగా రాజకీయ పార్టీలపై ఆశావాహుల ఒత్తిడి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికలతో సహా ప్రతి చోట పనిచేస్తారు కాబట్టి ఇది తప్పదు. అయితే అధికార పార్టీకి ఈ ఒత్తిడి ఇతర పార్టీల కన్నా నాలుగు ఇంతలు ఉంటుందనేది సహజం. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పరిస్థితి అదే. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అండగా ఉన్న నాయకులు వార్డుల వారీగా తమకు ఒక్క ఛాన్స్.. ఒకే ఒక్క ఛాన్స్ ఇవ్వాలని ఆరాటపడుతున్నారు. వీరిలో ఎవరిని ఎంపిక చేసిన మిగిలిన వారు అలిగి కూర్చునే ప్రమాదం ఉంటుంది. అయితే వార్డుల వారీగా బలోపేతంగా ఉన్న బీఆర్ఎస్ ను ఢీకొట్టాలంటే కచ్చితంగా వార్డుల వారీగా గెలుపు గుర్రాలు ఉండాల్సిందే. ప్రస్తుతం అలాంటి గెలుపు గుర్రాల వేటలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉన్నారు. ఈ క్రమంలో గెలుపు గుర్రాలు ఎవరో తెలుసుకునేందుకు వార్డుల వారీగా సీనియర్ నాయకులతో, మాజీ ఎంపిటిసి లతో సర్వేలు నిర్వహిస్తున్నారు. సర్వేల ద్వారా గెలుపుకు అవకాశం ఉన్నవారికి మాత్రమే టికెట్ ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మిగతా వారిని బుజ్జగించి పార్టీలోనే ఉండేలా చూసి నామినేటెడ్ పదవులకు ఎంపిక చేసేలా మాట్లాడే అవకాశం ఉంది. ఎందుకలా నోటిఫికేషన్‌కు సమయం దగ్గర పడుతుండడంతో ఈ సర్వేలు, చర్చలను మరింత వేగవంతం చేశారు. ఒకవైపు ఆశావాహులు తమ తమ ప్రయత్నాలను వివిధ రూపాల్లో కొనసాగిస్తున్నప్పటికీ ఎమ్మెల్యే మాత్రం కూల్‌గా గెలుపు గుర్రాలు ఎవరు అన్న దానిపై ఆరాధిస్తున్నారు. వార్డుల వారీగా ఆశావాహులకు ఎలాంటి సమాచారం లేకుండా మున్సిపాలిటీలోని మొత్తం 28 వార్డుల్లో వివిధ రూపాల్లో ఈ సర్వేలు జరుగుతున్నాయి. మరి నామినేషన్ నాటికి ఎవరెవరు తెర మీదికి వస్తారో వేచి చూడాలి.

**గెలుపే లక్ష్యంగా ముందడుగు..**

పురపాలికలో చైర్మన్ స్థానాన్ని ఎలాగైనా గెలుచుకోవడమే లక్ష్యంగా ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీ ముందడుగు వేస్తుంది. దీనికి కారణం ఉంది.. 2014లో జరిగిన మొదటి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. అగ్గనూరు విశ్వం ఇదే పార్టీ నుంచి మున్సిపల్ చైర్మన్‌గా తొలిసారి అధికార పీఠాన్ని సాధించారు. కాగా గత ఎన్నికల్లో ఈ స్థానాన్ని 28 వార్డులలో 25 వార్డులను గెలుచుకొని బీఆర్ఎస్ తన వశం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ చైర్మన్ ఎన్నికయ్యారు. 28 స్థానాలలో 25 బీఆర్ఎస్ గెలుచుకోగా, ఒక స్థానాన్ని ఎంఐఎం కైవసం చేసుకుంది. కాంగ్రెస్ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఈ మున్సిపాలిటీ ఎన్నికలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో 11 కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సమఉజ్జీలుగా ఉండగా, ఈ విడత చైర్మన్ స్థానాన్ని సాధించి 21 లెక్కన సిరీస్‌ను కొట్టేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. వార్డుల వారీగా మంచి పేరు ఉన్న నాయకులు, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో గుర్తింపు పొందిన అభ్యర్థులను ఎంపిక చేసి రంగంలోకి దించాలని కాంగ్రెస్ పార్టీ ఆలోచన. ఈ నేపథ్యంలోనే సర్వే కొనసాగుతోంది. మరి గెలుపు గుర్రాలనే ఎంపిక చేయడం, మిగతా వారిని బుజ్జగించడం అధికార పార్టీకి పెద్ద సవాలే. ఎందుకంటే ఒక్కో వార్డులో ముగ్గురు లేక నలుగురు టికెట్ల కోసం పోటీ పడుతున్నారు.

వీరిలో ఎవరినో ఒకరిని ఎంపిక చేసి మిగతా వారిని రెబల్స్‌గా నిలబడకుండా చేయడం, ఇతర పార్టీలోకి వెళ్లకుండా కాపాడుకోవడం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ముందున్న సవాల్. మరి దీన్ని ఏ విధంగా అధికమిస్తుందో, అనుకున్న లక్ష్యం వైపు విజయవంతంగా ఎలా సాగుతుందో వేచి చూడాలి.



మాట్లాడుతున్న శ్రీవర్ధన్ రెడ్డి

## మాకు ఛాన్స్ ఇవ్వండి

### షాద్‌నగర్‌ను అభివృద్ధి చేస్తాం
### గత పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ చేసింది సున్నా..
### బిజెపి నేతల వినతి

**షాద్‌నగర్, జనవరి 27, ప్రభాతవార్త :** రాబోయే మున్సిపల్ ఎన్నికల సన్నద్ధం కోసం షాద్‌నగర్ పట్టణం ఏబీ కాంప్లెక్స్‌లో బిజెపి పట్టణ అధ్యక్షులు హరి భూషణ్ అధ్యక్ష తన జరిగిన ముఖ్య నాయకుల సమావేశం లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భువనగిరి ఇంచార్జి నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, దేపల్లి అశోక్ గౌడ్, నర్సింహా గౌడ్, వంశీ కృష్ణ, మల్చలం మురళి, ఎంకనోళ్ల వెంకటేష్, మఠం ఋషి కేష్, మహిళా మోర్చా నాయకురాలు ప్రవీణ గారు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణ అభివృద్ధిలో గత పాలకుల వైఫల్యాలను ప్రజల ముందుకు తీసు కెళ్లాలని అన్నారు. మౌలిక వసతుల కొరత, డ్రైనేజీ సమ స్యలు, తాగునీటి ఇబ్బందులు, రోడ్ల దుస్థితి వంటి సమ స్యలపై ప్రస్తుత పాలకులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. అదేవిధంగా గత పదేళ్ళ పాలనలో మిగతా 2లో

## నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

### అలియాబాద్‌లో మున్సిపల్ కార్యాలయం, మూడుచింతలపల్లిలో ఎంసిపల్లి జడ్‌పి హైస్కూల్ ఎంపిక

**శామీర్‌పేట, జనవరి 27, ప్రభాతవార్త :** అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ఖరారు అయినట్లు దీనికి సంబంధించి నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేసినట్లు అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్‌లు తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల షెడ్యుల్ ఖరారు అయినందున ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించటం జరుగుతుందని అన్నారు. అయితే అలియాబాద్ మున్సిపాల్టీలో 20వార్డులకు సంబంధించి అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అభ్యర్థుల నుంచి నామినేషన్లను ఆర్ఓలు,ఎఆర్ఓలు వార్డుల వారీగ స్వీకరించటం జరుగుతుందని కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. అదే విధంగా మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో 24వార్డులు ఉన్నందున ఆయా వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుంచి నామినేషన్లను మూడుచింతలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నామినేషన్లు ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు స్వీకరించటం జరుగుతుందని ఆ మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయా మున్సిపాల్టీల పరిధిలో ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 28,29,30తేదీలలో నామినేషన్లను స్వీకరించటం జరుగుతుందన్నారు. 31న పరిశీలన, ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని, ఫిబ్రవరి 11న పోలింగ్ ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు, 13న కౌంటింగ్ జరుగుతుందని వారు వివరించారు.

## బిఫామ్‌ల కోసం ఎదురుచూపులు

### అభ్యర్థుల ఎంపికలో కొనసాగుతున్న సస్పెన్స్

**పరిగి, జనవరి 27, ప్రభాతవార్త :** పురపాలక ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయగా బుధవారం నుండి ఈనెల 30 వతేదీ వరకు నామినేషన్లు స్వీకరించాలని చెప్పడంతో పరిగి మున్సిపాలిటీలోని అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నం అవుతుంటే ఇటు పోటీ చేయడానికి ఆశావహులు అయోమయంలో ఉన్నారు. తమకు పార్టీల నుండి బి.ఫామ్. వస్తుందో రాదోనన్న ఆలోచనలో పడ్డారు.. పరిగి మున్సిపాలిటీలో 18 వార్డులు ఉండగా రెండు,మూడు వార్డుల్లో మాత్రమే ఇటు కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక జరిగినట్టు సమాచారం.. 18 వార్డుల్లో మొత్తం 27614ఓటర్లు ఉన్నారు.. అయితే ఇప్పటికే ఆశావహులు ఇరు పార్టీల నుండి బి.ఫామ్‌ల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికి , ఒకే పార్టీ నుండి ఒకే వార్డులో ఇద్దరికి పైగా టికెట్ ఆశిస్తుండటంతో అభ్యర్థుల ఎంపికకు ఇంకా కసరత్తు చేస్తున్నారు.. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నుండి ఆశావహులు ఎదురుచూస్తున్నా స్వతంత్రంగా పోటీకీ కొందరు సిద్ధమయ్యారు..వార్డుల వారిగా నస్కల్ (బిసి మహిళ), మల్లెమోనిగూడ (బిసి జనరల్), నజీరాబాద్ (ఎస్టీ జనరల్),సయ్యద్ మల్కాపూర్ (జనరల్), అయ్యప్పకాలనీ ( జనరల్ మహిళ), సుల్తాన్ నగర(జనరల్), సుల్తాన్ పూర్(జనరల్ మహిళ), తుంకలగడ్డ (జనరల్ మహిళ), రుక్కుంపల్లి (ఎస్సీ మహిళ), ప్రేమ్ నగర్ (ఎస్సీ జనరల్), ఎన్టీఆర్ కాలనీ( జనరల్), వెంకటేశ్వర కాలనీ (జనరల్), ఖాన్ కాలనీ (బిసి మహిళ), విజయనగర్ (బిసి మహిళ), మున్నూరు వాడ(బిసి జనరల్), శాంతినగర్ (జనరల్ మహిళ), ఇంద్రనగర్ (జనరల్ మహిళ), సయ్యద్ వాడ (బిసి.జనరల్)గా రిజర్వేషన్లు ఉండగా జనరల్, బిసి స్థానాల్లో పోటీకీ ఆశా వహులు ఎక్కువ ఉన్నారు. అయితే మున్సిపల్ పీఠం బిసి మహిళ కు కేటాయించడంతో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు తమకే పీఠం దక్కేలా ప్రయత్నాలు చేస్తున్నారు..




### ఒంటిపై ఉన్న నగలకు ఆశపడి..

## మహిళా కూలీ హత్య!

### కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు - ఇద్దరు నిందితులకు రిమాండ్

**తాండూరు, జనవరి 27, ప్రభాతవార్త :** ఈ నెల 24న పెద్దెముల్ మండలం రేగొండి అటవి ప్రాంతంలో జరిగిన మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. ఒంటిపై ఉన్న నగలకు ఆశపడిన ఇద్దరు అడ్డా కూలీలు, మరో మహిళ కూలీని నమ్మించి దారుణంగా హత్య చేశారు. మంగళవారం తాండూరు డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ నర్సింగ్ యాదయ్య, రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, పెద్దెముల్ ఎస్ఐ శంకర్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. యాలాల మండలం పగిడ్యాల గ్రామానికి చెందిన లొంకల బందెమ్మ(54) తాండూరు ప్రాంతంలో అడ్డా కూలీగా పనిచేసేది. పెద్దెముల్ మండలం బండమీదిపల్లి గ్రామానికి చెందిన మాల నర్సింలు, కర్ణాటక రాష్ట్రం బసవకళ్యాన్ ప్రాంతానికి చెందిన కిశోర్ షిండేలు కూడా అడ్డా కూలీలుగా పనిచేసేవారు. కూలీగా పనిచేసే బందెమ్మ ఒంటిపై ఉన్న కాళ్ల కడియాలు, పుస్తెల దండ, ముక్కు పుడక ఆబరణాలపై మాల నర్సింలు, కిషోర్ షిండేల కన్నుపడింది. ఆమె నుండి వాటిని సొంతం చేసుకోవాలని.. ఆమెను హత్య చేసేందకు పథకం వేశారు. ఈ క్రమంలో ఈ నెల 21 మాల నర్సింలు, కిషోర్‌లు బదెమ్మను పథకం ప్రకారం కూలీ పని ఉందంటూ.. ఆర్టీసి బస్సులో పెద్దెముల్ మండలం మంబాపూర్ గేట్ వద్ద బస్సు దిగి.. అక్కడి నుండి నడుచుకుంటూ రెగొండి అటవి ప్రాంతంవైపు తీసుకువెళ్లారు. అక్కడ నర్సింలు బందెమ్మ గొంతుపై పదునైన ఆయుదంతో దాడి చేసి హత్య చేశాడు. ఇందుకు కిశోర్ కూడా సహకరించాడు. ఆమె మృతి చెందిన తరువాత ఒంటిపై ఉన్న 30తులాల వెండి కడియాలు, 2.2 గ్రాముల బంగరు గుండ్లు, ముక్కు పుడక తీసుకొని వెళ్లిపోయారు. దొంగిలించిన వస్తువులను నర్సింలు శంకర్‌పల్లిలోని ఓ దుకాణంలో రూ.49వేలకు అమ్ముకున్నారు. ఈ నెల 24న రేగొండి అటవి ప్రాంతంలో బందెమ్మ మృతదేహం పోలీసులు గుర్తించారు. సంఘటన స్థలం వద్ద పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. మిగతా 2లో

# అడుగడుగునా అప్రమత్తం

### -మున్సిపల్ ఎన్నికల విధుల్లో వేగం పెంచిన అధికారులు
### -రంగారెడ్డి జిల్లాలో 274 పోలింగ్ స్టేషన్లు
### -602 బ్యాలట్ బాక్స్‌లు సిద్ధం
### -2500కి పైగా అధికారులు, సిబ్బంది నియామకం
### -కోడ్ అమలు షురూ చేసిన పోలీసులు

**రంగారెడ్డి అర్బన్, జనవరి 27,ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు తెరలేచింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ మేరకు జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మోడల్ కోడ్ అమల్లోకి వచ్చింది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, అమన్‌గల్, షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్ మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 126 వార్డులు ఉండగా, 1,75,974 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. చైర్మన్ పీఠానికి సంబధించి ఇబ్రహీంపట్నం జనరల్, షాద్‌నగర్ బీసీ, చేవెళ్ల జనరల్ (మహిళ), శంకర్‌పల్లి జనరల్, మొయినాబాద్ ఎస్సీ, అమన్‌గల్ జనరల్‌కు రిజర్వు అయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో జిల్లాలో రాజకీయ వేడి పెరుగుతోంది. అభ్యర్థుల ఎంపిక, వార్డు స్థాయి లెక్కలు, రిజర్వేషన్ ప్రభావంపై పార్టీల మధ్య చర్చలు ఊపందుకున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో జిల్లా అధికారులు తలమునకలయ్యారు.

రంగారెడ్డి జిల్లాలో జరగనున్న ఆరు మున్సిపాలిటీ ఎన్నికలలో మొత్తం 126 వార్డులు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 1,75,974 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 87,955 మంది పురుషులు, 88,016 మంది మహిళలు, ఇతరులు 3 మంది ఉన్నారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు జిల్లావ్యాప్తంగా 274 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జోనల్ అధికారులు 23మంది, ప్రయాణ పరిశీలన బృందాలు 18, స్థిర పరిశీలన బృందాలు 18, రిటర్నింగ్ అధికారులు 63 మంది, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు 63 మంది, ఓటింగ్ సిబ్బంది 1,781 మంది (30 శాతం అదనపు సిబ్బంది సహా) నియమితులయ్యారు. 602 బ్యాలట్ బాక్స్‌లు సిద్ధం చేశారు.





షాద్‌నగర్‌లో పోలింగ్ బూత్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్, డిసిపి,ఏసిపి

## ఒకే దఫాలో ఒకే రోజు పోలింగ్

### వికారాబాద్‌లో 100 మున్సిపల్ వార్డులు
### 234 పోలింగ్ స్టేషన్లు
### నిబంధనల ఉల్లంఘనకు తావు లేకుండా డేగకన్ను
### రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీలు, ఫొటోల తొలగింపునకు ఆదేశం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో జిల్లా అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తక్షణమే అమల్లోకి వచ్చిందని అధికారులు ప్రకటించారు. ఎంసీసీ అమలులో ఉన్న కాలంలో ఎలాంటి ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా, అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజా ప్రతినిధులు అధికారులు ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. మిగతా 2లో

## దాగుడు మూతలకు ఇక తెర

### అంతర్గత సర్వే పనిలో బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక కసరత్తు దాదాపు పూర్తి ?

**ఆమనగల్లు, జనవరి 27, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్డ్ విడుదల కావడంతో స్థానికంగా రాజకీయ వేడి పెరిగింది. వివిధ పార్టీల నుంచి ఆశావహులు ఆయా కీలక నేతల కార్యాలయాలముందు క్యూ కట్టారు. టికెట్ల కోసం వారిని ప్రసన్నం చేసుకునేందుకు మరింత ఒత్తిడిని పెంచుతున్నారు. దీంతో ఆయా నేతలు ఒకింత అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆమనగల్లు మున్సిపాలిటీలో 15వార్డులు ఉన్నాయి. జనరల్‌కు 8, ఎస్టీ 4, ఎస్సీ 2, బిసి జనరల్ 1 చొప్పున వార్డులకు రిజర్వేషన్‌లు కేటాయించారు. చైర్మన్ పదవి జనరల్‌కు కేటాయించారు. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీ, బిజెపి నుంచి పోటీ ఎక్కువగా ఉంది. రెండు పార్టీలు ఇప్పటికే అంతర్గత సర్వేలు చేపట్టి అభ్యర్థుల ఎంపికను కొలిక్కి తీసుకువచ్చినట్లు పార్టీలో అంతర్గత చర్చలు వినిపిస్తున్నాయి. ఒక్కో వార్డుకు ఇద్దరు, ముగ్గురు ఆశావాహులు పోటిపడుతుండడంతో అధినేతలకు తలనొప్పిగా మారింది. రిజర్వేషన్ల ఖరారు నాటి నుండి ఆశావాహులు ఇంఛార్జిలపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఎవ్వరిని కాదనకుండా చివరి వరకు ప్రకటించకుండా అధికార కాంగ్రెస్‌పార్టీ, బిజెపి పార్టీల ఇంఛార్జిలు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు చకచక్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సుధీర్ఘకాలంగా టికెట్టు తనకే అన్న ధీమాతో ఉన్న ఆశావహులు సైలెంట్‌గా ప్రచారానికి కూడా శ్రీకారం చుట్టారు. కొన్ని వార్డులలో అభ్యర్థుల ఎంపికను ఖరారు చేసిన అధినేతలు వారికి అభయహస్తం కూడా ఇచ్చేశారని తెలుస్తోంది. కొలిక్కిరాని వార్డులలో రోజురోజుకు టెన్షన్‌కు గురౌతున్నట్లు కనిపించారు. ఒకపక్క ధీమా, మరోపక్క భయంతో వారు టిక్కెట్టుపై ఆశలతో ఉన్నారు.

అయితే బిఆర్ఎస్ పార్టీలో మాత్రం భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. పార్టీలో అభ్యర్థుల ఎంపికపై ఒకింత ఒత్తిడి లేన్నట్లు తెలుస్తోంది. అధిక సంఖ్యలో ఆశావాహులు లేకపోవడమే అందుకు కారణంగా చెబుతన్నారు.




## సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

### ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ మనుచౌదరి ఆదేశం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 27, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాల్టీలు అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్‌లకు ఎన్నికలు నిర్వహించనున్నందున మంగళవారం సాయంత్రం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికలకు నగారా మోగటంతో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వాహణకు ఏర్పాట్లు చేపట్టింది. ఈ సందర్భంగ మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ జిల్లాలోని మూడు మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27వ తేదీ సాయంత్రం నుంచే ఎన్నికల ప్రవర్తన నియమావళిని ననుసరించి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి 30వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 31న నామినేషన్ల స్క్రూట్నీ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నాం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడువు ఉంటుందన్నారు. ఆ తరువాత వార్డులకు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారని అన్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ ఉంటుందని, 13న కౌంటింగ్ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. మున్సిపల్ ఎన్నికలను సమర్ధవంతంగ నిర్వహించాలని వార్డుల సభ్యుల ఎన్నికల నిర్వాహణ ప్రశాంత వాతావరణంలో సమర్ధవంతంగ నిర్వహించాలని, ఎలాంటి అవతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ, శాంతిభద్రతలను కాపాడుతూ ఎన్నికల ప్రవర్తన మిగతా 2లో




## పంచాయతీలకే సర్వాధికారాలు

### ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పల్లె సీమల పురోగాభివృద్ధికి పాటు పడుతోందని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం వికసిగ్ భారత్ గ్యారెంటీ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (వీబీ-జీ-రామ్‌జీ) పథకం గ్రామాలకు మేలు చేస్తుందని గుర్తు చేశారు. గ్రామపంచాయతీలకు దండిగా నిధులు కేటాయించి మిగతా 2లో



మేడారంలో మొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే

## సమ్మక్క సారక్కలది అసమానమైన వీరత్వం

### నమ్మిన ప్రజల కోసం సాహస పోరాటం చేశారు

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

3



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

## రోడ్డుభద్రతా చర్యలపై సిబ్బందికి అవగాహన

**ఘట్‌కేసర్, జనవరి 27, ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఇక్కరూ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిహెచ్‌ఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలోని సమావేశపు హాలులో మంగళవారం కార్యాలయ సిబ్బందికి రోడ్డుభద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, డీసీ అల్లూరి వాణి, ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారులు పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలపై తెలియజేశారు.

## యోగా ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు అపారం : ఎమ్మెల్యే తలసాని



**సంజీవరెడ్డి నగర్, జనవరి 27, ప్రభాతవార్త:** యోగా చేయడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం సనత్ నగర్‌లోని బీకే గూడ పార్క్‌లో యోగా సాధకుల కోసం రూ. 39 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన షెడ్డును కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ ... మ్‌తో కలిసి ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా పార్క్‌కు వచ్చే వాకర్స్, యోగా సాధకులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్క్‌లో ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా పచ్చదనం పెంచేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. పార్క్‌లో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, యోగా సాధకులు ఈ షెడ్డును సద్వినియోగం చేసుకోవా లని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పే ట సర్కిల్ డీసీ సుజాత, జీహెచ్‌ఎంసీ డీఈ మహేష్, ఎలక్ట్రికల్ డీఈ కృష్ణారావు, హార్టికల్చర్ అధికారి సైదులు గౌడ్, శానిటేషన్ డీఈ వెంకటేష్, వాటర్ వర్క్స్ మేనేజర్ సింధూజ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, హన్మంతరావు, సీనియర్ సిటిజన్స్ సభ్యులు పార్థసా రథి, దూబే, సాయి, అనంతరెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, అశోక్ యాదవ్, నర్సింహ, గోపి లాల్ చౌహాన్, గుడిగే శ్రీనివాస్ యాదవ్, ఖలీల్, బాలరాజ్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను వినియోగించుకోవడం వల్ల ఉద్యోగాలు పొందడం సులభం

**: నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ**

**చిక్కడపల్లి జనవరి 27 ( ప్రభాతవార్త ) :**

గ్రంథాలయంలో వనరులను, మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవడం మూలంగా ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్య మవుతుందని నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ అన్నారు. మంగళవారం అశోక్ నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో గన్ ఫౌండ్రీ శాఖా గ్రంథాలయంలో గత మూడు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా చదువుకుంటూ, కష్టపడి కేంద్ర పారిశ్రామిక భద్రత దళంలో కానిస్టేబుల్ గా ఉద్యోగం పొందిన గుడిసె అఖిల్ ను కార్యదర్శి పద్మజ సత్కరించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యా లను చేరుకోవడానికి గ్రంథాలయాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తు న్నామని, అఖిల్ స్ఫూర్తితో మరింత మంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలను సాధించాలని ఆమె ఆకాంక్షి ... ంచారు. అఖిల్ ఈ విజయాన్ని సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.

## నేడు సిఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం : ఎంఇఓ

**నార్సింగి, జనవరి 27 ప్రభాతవార్త :**

గండిపేట మండల పరిధిలోని విద్యార్థులకు జరిపే సిఎం కప్ పోటీలను ఈ రోజు బండ్లగూడలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యా లయం మైదానంలో నిర్వహిస్తున్నామని ఎంఇఓ సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.గంటలకు క్రీడా పోటీలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చేతుల మీదుగా ప్రారంభిస్తు న్నట్లు వివరించారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులు ఉదయం ఏడు గంటల వరకే క్రీడా మైదానంకు చేరుకోవాలని సూచించారు. ప్ర తిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించడంతో పాటు జి ల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వివరించారు.

## దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**జూబ్లీహిల్స్, జనవరి 27, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలోని దివ్యాంగులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎస్సీ ఎస్టీ సంక్షేమ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. బంజారా హిల్స్‌లోని మంత్రుల ప్రాంగణ సముదాయంలో తెలంగాణ ఎలక్ట్రి సిటీ డిఫ్రెంట్లీ ఎబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని మంత్రి ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాగా దివ్యాంగుల ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యత కలిపించాలని ఉద్యోగులు మంత్రిని కోరగా సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారిస్తామని హామీని చ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు శ్రవణ్ కుమా ర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఇందూరు రోషన్, అసోసియోట్ ప్రెసిడెం ట్ వినోద్, కంపెనీ సెక్రటరీ యాదయ్య, పాల్గొన్నారు.

## సంగీత విద్వాంసులుఓరుగంటి ఆనంద్ మోహన్ కన్నుమూత

**చిక్కడపల్లి జనవరి 27 (ప్రభాతవార్త ) :**

ప్రముఖ సంగీత విద్వాంసులు, సంగీత క్షీ ... రసాగరం వ్యవస్థాపకులు ఓరుగంటి ఆనంద్‌మోహన్ (90) సోమవారం రాత్రి మృతి చెందా రు. 90 ఏళ్ల వయ సులో ఆర్టీసీ క్రాస్ రోడ్స్ జవహర్ నగర్‌లో ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచా రు. ఎవరి వద్ద నుండి ఆర్థిక సహాయం ఆశించకుండా తన గురువు స్మరణార్థం 699 సంగీత కచేరీలను నిర్వ హించిన నిస్వార్థ జీవి. ఆకాశవాణి హైదరా బాద్ కేంద్రంలో లలిత సంగీత కళాకారు డిగా, ఢిల్లీలోని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో అధికారిగా సేవ లందించారు. శాస్త్రీయ సంగీతంలో ఆయన కృషిని గుర్తించిన కంచి కామకోటి పీఠం ఆయనను ఆస్థాన విద్వాం సునిగా గౌరవిం చింది. ఎందరో యువ కళా కారులకు ప్రో త్సహించారు. సంగీత లోకానికి ఆనంద్ మోహన్ చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయ న ఆత్మకు శాంతి చేకూ రాలని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్చి కె వి.రమణాచారి, చిక్కడపల్లి త్యాగరాయగానస భ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి తదితరులు సంతాపం వ్యక్తం చేసారు.

# సాయిసోషల్ ఎంపవర్‌మెంట్ సొసైటీకి గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డు

**-మహిళా సాధికారతలో 25 ఏళ్ల అంకిత సేవకు గౌరవం**



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నుంచి అవార్డు అందుకుంటున్న మంజుల

**ఘట్‌కేసర్, జనవరి 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో మహిళా సాధికారత రంగంలో విశేష సేవలు అందిస్తున్న సాయి సోషల్ ఎంపవర్‌మెంట్ సొసైటీకి గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డు 2025 లభించింది. ఈమేరకు హైదరాబాద్ లోకభవన్‌లో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా సంస్థ నిర్వాహకురాలు కాంటేకర్ మంజుల అవార్డును అందుకున్నారు. మహిళల అభివృద్ధి, ఆర్థిక స్వాలంబన, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో గత 25 సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందిస్తూ, మహిళలను, యువకులను సాధికారత దిశగా నడిపించినందుకు ఈఅవార్డు ప్రధానం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ మహిళలు ఆత్మగౌరవంతో సొంతంగా రాణించేలా సాయిసోషల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ కృషి చేస్తుందని అవార్డు కమిటీ ప్రశంసించింది. ఈసందర్భంగా అవార్డు గ్రహీత మంజుల మాట్లాడుతూ తమ సంస్థ చేసిన సేవలకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా లభించిన ఈగౌరవం మరింత బాధ్యత పెంచిందని, కేవలం ఒక అవార్డుతో మాత్రమే కాకుండా మహిళల కోసం పనిచేస్తున్న ప్రతిఒక్కరికి వచ్చిన ప్రోత్సాహం, భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవలందిస్తూ మహిళల సాధికారత లక్ష్యాన్ని కొనసాగిస్తామని ఆమె తెలిపారు. మహిళా ఎంపవర్‌మెంట్ క్యాటగిరీలో సాయిసోషల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ అందిస్తున్న సేవా, మహిళ శిక్షణా కార్యక్రమాలను గుర్తించి గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డును ప్రధానం చేశారు. గవర్నర్ చేతుల మీదుగా సన్మానం చేసి ప్రశంసాపత్రం, జ్ఞాపికలను మంజుకు అందజేశారు. ఈకార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రితి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# బిజెపిపై నమ్మకంతో పార్టీలో చేరికలు

**ఎంపి ఈటల రాజేందర్**



బిజెపిలో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న ఎంపి ఈటల రాజేందర్

**మేడ్చల్, జనవరి 27. ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్రమోదీపై నమ్మకంతో నేడు బిజెపిలో చేరుతున్నారని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని రాజబొల్లారం తండాకు చెందిన బంజారా యువజన సంఘం నాయకుడు మాలోత్ నరేందర్, అతని మిత్ర బృందంతో పాటు తండాలోని శివాజీ, బంజారా యువజన సంఘాల సభ్యులు ఎంపీ ఈటల సమక్ష్యంలో బీజేపీలో చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలోని ప్రజలు కేంద్రంలో కొనసాగుతున్న బిజెపి పాలనలో సంతృప్తిగా ఉన్నారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. బిజెపి చేపడుతున్న పథకాలకు ఆకర్షితులై యువతతో పాటు ఇతర పార్టీల నాయకులు బిజెపిలో చేరుతున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని ఈ సందర్భంగా ఎంపీ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, జిల్లా ఇంచార్జ్ రంగారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్, ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్‌తో పాటు పార్టీలో చేరిన వేణు, గౌతం, రోహిత్, సిద్దు, సక్రు నాయక్, రవి నాయక్, రోహన్, శ్రీనివాస్ నాయక్, రాకేష్, వినోద్, సంపత్, విష్ణు, శ్రీధర్, నర్సింగ్, సురేష్, దువంశీ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు



బిఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**మేడ్చల్, జనవరి 27. ప్రభాతవార్త :** కాంగ్రెస్ పాలనలో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు బిఆర్ఎస్‌కు మద్దతుగా నిలుస్తున్నారని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీలోని కోనాయిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే సమక్ష్యంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు తాగు నీరు అందలేక, కరంట్ రాక, పింఛన్‌లు అందక, రైతు బంధు బంద్దై ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో కేసిఆర్ గ్రామ గ్రామాన మంచినీరు, 24 గంటల కరెంట్ అందించి అన్ని విధాల అభివృద్ధి చేశారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పడుతున్న కష్టాలను భరించలేక కెసిఆరే కావాలని బిఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం తధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల పార్టీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్ ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, సుదర్శన్, సురేష్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, నిషిత, యూనుస్‌పాష, జీవన్, శేఖర్‌తో పాటు బిఆర్ఎస్‌లో చేరిన కుమార్, భాస్కర్, శ్యామ్ కుమార్, నర్సింగ్, ప్రవీణ్, వంశీ, సత్యనారాయణ, నర్సింహ, శోభ, కుమార్, యాదగిరి, భిక్షపతి, కృష్ణ, సత్తయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేవంతెన పూర్తి చేసే వరకు పోరాటం చేయాలి



ఆర్‌ఓబి పోరాట కరపత్రాన్ని విడుదల చేస్తున్న మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ తదితరులు



సమావేశానికి హాజరైన ప్రజలు, యూత్ సభ్యులు

**-ఎమ్మెల్యే, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**-ఆందోళనపై కార్యాచరణ ప్రకటన**

**ఘట్‌కేసర్, జనవరి 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన పూర్తి చేసేవరకు పోరాటం ఆగదని మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ స్పష్టం చేశారు. ఘట్‌కేసర్ పటేల్‌నగర్‌లోని ఆర్యవైశ్య శ్రీవాసవీ కళ్యాణ మండపంలో మంగళవారం ఆర్‌ఓబిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013లో ప్రారంభమైన ఘట్‌కేసర్ రైల్వేగేటుపై ఆర్‌ఓబి నిర్మాణ పనులు 16 సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కాకపోవడంపై సమావేశంలో పలువురు నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా నాయకులు, ప్రజలు, యువజన సంఘాలు ఆర్‌ఓబి పూర్తి చేసేంత వరకు పోరాటం చేసేందుకు కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 15 రోజుల్లో వంతెన పనులు వేగవంతం కాకుంటే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఆర్‌ఓబిపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ జాతీయ రహదారిపై రస్తారోకో చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈసందర్భంగా వంతెన నిర్మాణ క్రమం, నిధుల కేటాయింపు, కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం, ప్రజల ఇబ్బందులపై ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ కరపత్రాన్ని విడుదల చేశారు. వంతెన రోడ్డుకు ఇరువైపులా బాధితులకు టిడిఆర్ ఇవ్వాలని ఆదేశించి 6 నెలలు గడుస్తున్నా మున్సిపల్ కమిషనర్ రాజేశ్ అలసత్వం ప్రదర్శించడంతో రోడ్డు వెడల్పు కాక పనులు కావడం లేదని ఆయన అన్నారు. గతంలో ఆగిపోయిన వంతెన పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించి అప్పటి మంత్రి మల్లారెడ్డి 3 నెలల్లో పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చి మూడు సంవత్సరాలు అవుతుందని ఇంకా పూర్తి కాలేదని విమర్శించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి బీఆర్ఎస్ అధికారంలో లేదని నిర్లక్ష్యం చేస్తూ అధికారులతో సమీక్ష నిర్వహించకుండా సమస్య పరిష్కారానికి చొరవ చూపాడం లేదన్నారు. ఆర్‌ఓబి బాధితులతో చర్చించి వారికి న్యాయబద్ధమైన నష్ట పరిహారం చెల్లిస్తే రోడ్డు వెడల్పు జరుగుతుందని, అధికారులు మాత్రం భూసేకరణ విషయంలో అశ్రద్ద చేస్తున్నారని, ప్రజలు పడుతున్న అవస్థలు వారికి పట్టడం లేదని ఇకనైనా మొద్దు నిద్ర వదలి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వంతెన పూర్తి చేయాలని నిరాహారదీక్ష చేయగా ఆరు నెలల్లో చేస్తామని మల్లారెడ్డి హామీ ఇచ్చి మరచిపోయారని, గేటు అవతల నివాసం ఉండే వారికి సమస్య తెలుస్తుందని కళ్లబొమ్మి మాటలు చెప్పే వారు ప్రజాసమస్యలపై స్పందించకుడా సోషల్ మీడియాలో ఉంటారని తెలిపారు. వంతెన పూర్తి చేయకుండా జాప్యం చేసిన కాంట్రాక్టర్‌ను రద్దు చేయకుండా జాతీయరహదారి పనులు కూడా అప్పగించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేసి ప్రజలను చైతన్యం చేసి పోరాటానికి సిద్దం కావాలని పక్షం రోజులలో స్పందన రాకుంటే హైవేఎపై ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈసమావేశంలో మాజీ కౌన్సిలర్లు బేతాల నర్సింగ్‌రావు, కుతాడి రవీందర్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, కొత్తకొండ వెంకటేష్, మీసాల సుధాకర్‌రావు, బూరుగు చంద్రశేఖర్‌గుప్తా, రాంమోహన్, సిసిఐ జిల్లా నాయకులు కల్లూరి జయచంద్ర, కేశవపట్నం అంజనేయులు, సోమయ్య, రాంచందర్, నందగోపాల్, గోపాల్, వెంకటేశ, కుమార్, శంకర్, శ్రీనివాస్, ప్రసన్న, శ్రీనివాస్‌గౌడ్, సురేశ్, కేఫా, వీరేందర్, పద్మారావు, అనిల్‌కుమార్, ప్రకాష్, సుధాకర్, సహదేవ తదితరులు పాల్గొన్నారు.




## గ్రామపంచాయతీలకే సర్వాధికారాలు

(మొదటి పేజీ తరువాయి)

సర్పంచ్‌లకు సర్వాధి కారాలు కల్పించాలన్నదే పథకం ఉద్దేశ్యమని చెప్పారు. గతంలో గడ్డి, పొదలను మాత్రమే తొలగించి పథకాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇకపై గ్రామీణ రహదారులు, మురుగునీటి కాల్వలకు వీబీ-జీ-రామ్‌జీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షల కోట్లను కేటాయిస్తుందని వెల్లడించారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా గౌతాపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడారు. 2005 కంటే ముందు నుంచీ ఉపాధి హామీ పథకం ఉందని గుర్తు చేశారు. రాజుల కాలంలో కూడా కరువు నివారణకు ఇలాంటి కార్యక్రమాలు చేశారని చెప్పారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో అనేక లోపాలు, దుర్వియోగం ఉన్నందున సవరణ చేపట్టాల్సి న అవసరం వచ్చిందన్నారు. 2014 నుంచే ప్రధాని మోడీ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. కూలీల పేరిట దళారులకు ఆహారంగా మారిన పథకం రూపురేఖలు మార్చి అమలు చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు.

మోడీతో సీఎంకు మంచి సంబంధాలు పీఎం మోడీతో సీఎం రేవంత్ మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారని ఎంపీ కొండా వ్యాఖ్యానించారు. ఇది మంచి సంప్రదాయమన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో చిల్లిగవ్వ లేనందున అభివృద్ధికి నిధులు కేటాయించలేనని సీఎం చేతులెత్తేశారని అన్నారు. కేంద్రం వీబీ-జీ-రామ్‌జీ పథకం ద్వారా గ్రామాలకు దండిగా నిధులు ఇవ్వనున్నారని తెలిపారు. ఈ నిధుల ద్వారా గ్రామాలను సుందరంగా తీర్చి దిద్దవచ్చని సూచించారు. ఇంత మంచి పథకాన్ని కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తుందో తెలిపాలని ఆయన అన్నారు. ఇది వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కోసం కేంద్రం ఇచ్చేనిధులను పక్కదారి పట్టించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేసీఆర్ నేతృత్వంలో రెండు దఫాలు ఈ పథకాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పైగా ప్రధాని మోడీని ధూషించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా పథకం నేరుగా గ్రామపంచాయతీల ఖాతాల్లోకి వెళతాయని చెప్పారు. సర్పంచ్‌లు తమ అధికారాలను, విధులను సమర్థవంతంగా చేపట్టవచ్చని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డులకూ బీజేపీ పోటీ చేస్తుందని ఎంపీ విశ్వేశ్వరరెడ్డి ప్రకటించారు. ఏ రాజకీయ పార్టీతోనూ లోపాయికారి ఒప్పందాలు ఉండోమని స్పష్టం చేశారు. బీజేపీకి చైర్మన్ సీటు దక్కే అవకాశాలు ఉంటాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు టీ.బాలేశ్వర్‌గుప్తా, యు.రమేష్‌కుమార్, గౌతాపూర్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాకు ఛాన్స్ ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

గుండు సున్నా అని, షాద్ నగర్ లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రజలకు మంజూరు చెయ్యలేదని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, శుభ్రమైన పాలన, పారదర్శకతతో కూడిన పరిపాలన అందించడం సాధ్యమవుతుందని అన్నారు. యువత, మహిళలు, పేదల సంక్షేమమే పార్టీ లక్ష ... ్యమని పేర్కొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తుందని, మున్సిపల్ స్థాయిలో కూడా అదే విధంగా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించే లక్ష ... ్యం బీజేపీ ముందుకు పోవాలని అన్నారు. ఈ సందర్భంగా అందే బాబయ్య గారు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిపాలనలో పారదర్శకత లేకపోవడమే ప్రధాన సమస్యగా మారిందని అన్నారు. ప్రజలపై పన్నుల భారం పెరిగినా, తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు నిరక్ష ... ్యం వహించారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు సరైన రీతిలో ప్రజలకు అందడం లేదని పేర్కొన్నారు. బీజేపీకి అవకాశం ఇస్తే కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. షాద్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పుకు బీజేపీనే సరైన ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ చారి, గజ్జల ప్రవీణ్, పసులోటి శ్రవణ్, కంచుకోట మణికంఠ, కాసజు శివ, శ్యామ్ సుందర్, వెంకటేష్, అందేల సందీప్, క్యామ మహేష్, రమేష్, అంజనేయులు, నక్కల మల్లేష్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఒకే దఫాలో ఒకే రోజు పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

అదేవిధంగా, పట్టణ పరిధిలో ఉన్న అన్ని రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, ఫోటోలు, ఇతర అభ్యంతరకరమైన ప్రచార సామగ్రిని వెంటనే తొలగించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశించారు.

30 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు, ఫలితాలు విడుదల చేయనున్నారు. ఒకే దఫాలో ఒకే రోజు పోలింగ్ జరగనుంది. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ నాలుగు మున్సిపాలిటీల్లో 1,74,509 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళా ఓటర్లు 88,696 మంది ఉండగా పురుషులు 85,781 మంది ఉన్నట్లు అధికారులు తేల్చారు. మరో 32 మంది ఇతరులు ఉన్నారు. ఈ నాలుగింటిలో 100 మున్సిపల్ వార్డులు ఉండగా 234 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. మంగళవారం ఎన్నికల కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పి స్నేహ మెహ్రా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుదీర్, తాండూర్, వికారాబాద్, కోడంగల్, పరిగి మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లాకు సంబంధించి తీసుకున్న ఎన్నికల ఏర్పాట్లను వివరించారు.

## సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

(మొదటి పేజీ తరువాయి)

నియమావళి పటిష్టంగా అమలు చేయాలన్నారు. సమస్యాత్మకంగ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని అన్నారు. ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించటం జరిగిందన్నారు. 2011 జనాబా ప్రకారం ఎన్నికలకు షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, 2024ఎస్ఈఈఈ పిసి సర్వే ప్రకారం వెనకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కేటాయించినట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. అయితే జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాల్టీల్లో 68వార్డులు ఉన్నట్లు, అలియాబాద్ మున్సిపాల్టీలో 20వార్డులు, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో 24వార్డులు, ఎల్లంపేట్ మున్సిపాల్టీలో 24వార్డులు ఉన్నట్లు దీనికి సంబంధించి వార్డుల వారీగ నామినేషన్లు స్వీకరించటానికి రిటర్నింగ్ అధికారులను, అదనపు రిటర్నింగ్ అధికారులను నియమించటం జరిగిందన్నారు. ఎల్లంపేట్ మున్సిపాల్టీలో 24వార్డులు, 48పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు 22,581మంది ఉన్నారు. అలియాబాద్ మున్సిపాల్టీలో 20వార్డులు, 40పోలింగ్ కేంద్రాలు, 20,451మంది ఓటర్లు ఉన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో 24వార్డులు, 48పోలింగ్ కేంద్రాలు, 22,831మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగ మూడు మున్సిపాల్టీల్లో 68వార్డులు, 136పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగ, 65,863మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వాహణ కోసం 29మంది ఆర్ఓలు, 29మంది ఎఆర్ఓలు, జోనల్ అధికారులు 9మంది, ఫ్లయింగ్‌స్క్వాడ్స్ 6మంది టీమ్స్, స్థిర నిఘా బృందాలు 6మంది టీమ్స్, పోలింగ్ సిబ్బంది సుమారు 1050మంది వరకు ఎన్నికల నిర్వాహణలో ఉండనున్నారు. మూడు మున్సిపాల్టీలకు 303బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వాహణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ఓటర్లు అందరు సజావుగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనుచౌదరి కోరారు.

## ఒంటిపై ఉన్న నగలకు ఆశపడి.. మహిళా కూలి హత్య

(మొదటి పేజీ తరువాయి)

మృతురాలి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, డిఎస్పీ నర్సింగ్ యాదయ్య ఆదేశాలతో రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శంకర్‌లు దర్యాప్తు ముమ్మరం చేశారు. తాండూరు పట్టణంలో అడ్డా కూలీలు ఉండే ప్రాతంలో సీసీ కెమరాలను పరిశీలించి నిందితులను గుర్తించారు. హంతకులు బందెమ్మను ఆర్టీసి బస్సులో మంబాపూర్ తీసుకువెళ్లి, అక్కడి నుండి నడుచుకుంటూ రేగొండి అటవి ప్రాంతంలోకి తీసుకువెళ్లి హత్య చేసినట్లు నిర్ధారించారు. మంగళవారం తాండూరు పట్టణంలోని కూలీల అడ్డా వద్దకు నిందితులు మాల నర్సింలు, కిశోర్ షిండేలు వచ్చిన విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు డిఎస్పీ వివరించారు. ప్రధాన నిందితుడు నర్సింలుపై 2021లో హత్య కేసు నమోదు కావడంతో జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. నిందితులు ఇద్దరిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు కేసు చేదనలో చాకచక్యంగా పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ దస్తయ్య, మున్నయ్య, ప్రతాప్, క్రిష్ణారెడ్డి, అంజద్, శివలతో పాటు డ్రైవర్ అంజి, సహకరించిన ప్రైవేట్ సిబ్బంది అంజిలను డిఎస్పీ అభినందించి నగదు రివార్డును అందజేశారు.

## అభయాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్‌గా సత్యవతి

**హైదరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:**



అమీర్‌పేట్‌లోని ఈస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ గా డి.సత్యవతి ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. బౌద్ధనగర్, గంగుబాయి బస్తీ, ఎస్ఆర్‌టి, ఈస్ట్ శ్రీనివాస నగర్ కాలనీలకు చెందిన ప్రజలు ఆలయంలో సమావేశమై ..ఫౌండర్ ట్రస్టీ యాదగిరి కుమార్తె సత్యవతిని చైర్మన్‌గా నియ మించాలని ఆలయ అర్చకులతో పాటు మెజార్టీ సభ్యులు ప్రతిపాదించడంతో ఆమెను ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సత్యవతిని చైర్మన్‌గా ప్రకటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ త్వరలో పూర్తి స్థాయి కమిటీని నియమిస్తామని దాతలు, భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న శివస్వాములు

**జిల్లేడు చౌదరిగూడెం, జనవరి 27, ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎలికిచెర్ల గ్రామం నుండి గురు స్వామి కమ్మరి భూపాల చారి ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టిన శివ స్వాములు శ్రీ శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనాన్ని చేసుకున్నారు. ఈనెల 19వ తారీఖున మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 452 మంది శివ స్వాములు పాదయాత్రగా బయలుదేరి వెళ్లి శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్నట్లు గురు స్వామి తెలిపారు. శివ స్వాములు నియమ నిష్టలతో ప్రతినిత్యం స్వామివారిని ధ్యానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు తదితరులు పాల్గొన్నారు.





జీడిమెట్ల నుండి పోచారం వరకు గల రోడ్డుకు మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరుతూ ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణికి వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్.

## జీడిమెట్ల పోచారం రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టండి

**సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి**

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 27, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ 8వ వార్డులో జీడిమెట్ల నుండి పోచారం గ్రామంవరకు గల రోడ్డును వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరుతూ ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణికి స్థానిక నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. జీడిమెట్ల నుండి పోచారం గ్రామానికి రోడ్డును ఇటీవల భూగర్భడ్రైనేజీ నిర్మాణం కొరకు తవ్వి డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. డ్రైనేజీ పనులు పూర్తయిన రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తి చేయకపోవడంతో రోడ్డు గుంతల మయంగా ఉందని తెలిపారు. ఫిబ్రవరి నెలలో మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని దీంతో గ్రామస్తులతో పాటు ఆలయానికి విచ్చేసే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వెంటనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతూ డిప్యూటి కమిషనర్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. డిసిని కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో బిఆర్ఎస్ నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, ఎ. మహేశ్ తదితరులున్నారు.

## 143 మంది కంటి శుక్లాల రోగులకు పునః సమీక్ష

**మాడ్గుల, జనవరి 27,ప్రభాత వార్త:** ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెలలో ఉచితంగా కంటి శుక్లాల శస్త్రచికిత్సలు పూర్తి చేసుకున్న 143 మంది రోగులకు పునఃసమీక్ష కార్యక్రమం మాడ్గుల మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ప్రముఖవైద్యులచే నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోగుల కంటి ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. ఈ పునః సమీక్ష కార్యక్రమాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. రోగుల ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు అందిస్తున్న చికిత్సలు, సూచనలను ప్రత్యక్షంగా గమనించారు. గత నెలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 143 మంది పేదలకు కంటి శుక్లాల రోగులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ మంగళవారం,బుధవారం పునః సమీక్ష కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. పేదల కళ్లల్లో వెలుగులు నింపే ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగిస్తామని, ఎల్లప్పుడూ పేద ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెన్నై నుంచి వచ్చిన వైద్య బృందం రోగులకు ఆరోగ్యకరమైన ఆహార నియమాలు, కంటి సంరక్షణకు సంబంధించిన అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అలాగే అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు కూడా పంపిణీ చేశారు. పునః సమీక్షకు హాజరైన రోగులు మాట్లాడుతూ, సాధారణంగా ఎంతో ఖర్చుతో కూడుకున్న కంటి శుక్లాల శస్త్రచికిత్సలను ఉచితంగా చేయించి, అనంతరం పునః సమీక్షతో పాటు కంటి అద్దాలు కూడా అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ జీవితాల్లో వెలుగులు నింపిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని, ఆయన నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐక్యత మాడ్గుల ఇంచార్జ్ సూదిని జైపాల్ రెడ్డి, సభ్యులు రచ్చ శ్రీరాములు, శ్రీపతి, శేఖర్, నాగిళ్ళ శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకిరెడ్డి

## ప్రజాసమస్యల పరిష్కారం లక్ష్యంగా పనిచేస్తా

**గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్**



**తలకొండపల్లి, జనవరి 27:ప్రభాత వార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని జూలపల్లి గ్రామ అభివృద్ధి కోసం గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ గ్రామ ప్రజలతో కలిసి తకొండపల్లి మండల ఎంఆర్‌ఓని మరియు డిప్యూటీ ఎంఆర్‌ఓని సాదరంగా కలిశారు. ఈ సమావేశంలో జూలపల్లి గ్రామానికి సంబంధించిన రెవిన్యూ సమస్యలు, భూ వివరాలు, ప్రజలకు అవసరమైన అంశాలు తదితర విషయాలపై అధికారులతో చర్చించి, అవసరమైన సమాచారం తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు ఈ సమావేశంలో మర్యాదపూర్వకంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీ. గోవర్ధన్ గౌడ్, కె. మల్లయ్య యాదవ్, జి. మల్లేష్ గౌడ్, కె. శివ యాదవ్ గార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌ఓకి మరియు డిప్యూటీ ఎంఆర్‌ఓకి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి ఫ్రేమ్‌ను బహూకరించి ఘనంగా సన్మానం చేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా అధికారులతో సమన్వయంతో పనిచేస్తామని సర్పంచ్ శ్రీ కడారి శేఖర్ యాదవ్ తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**-మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ తహిమీనా**

**వికారాబాద్, జనవరి 27, ప్రభాతవార్త :** జిల్లాలో రైతుల సౌకర్యార్థం కందుల కొ నుగోలు కేంద్రాల ు ప్రారంభించినట్లు మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ తహిమీనా ఒక ప్రకటనలో తెలి పారు. జిల్లాలో నాఫెడ్ ఆధ్వర్యం లో మార్క్ఫెడ్ ద్వారా 7 కొ నుగోలు కేంద్రాల ు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. జిల్లావ్యాప్తంగా కొడం గల్, మర్పల్లి, తాండూర్, పరిగి, వికారాబాద్, దారూర్, పూడూరు లోని పిఏసిఎస్, డిసిఎంఎస్ లు 7 కేంద్రాల ద్వారా కందులు కొ నుగోలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రైతులకు కొ నుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన కందులకు క్వింటాలుకు 8 వేల రూపాయల కనీస మద్దతు ను చెల్లించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రైతులు ప్రభుత్వం కల్పించే ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రైతులు ఎవరు కూడా దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

## సర్పంచును సన్మానించిన వైద్య బృందం

**నందిగామ, జనవరి 27, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్‌తో పాటు వార్డుసభ్యులను సన్మానించారు. సన్మాన గ్రహీతలో ఎంసి డైరెక్టర్ నర్సింలు, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, అగ్గి సూరి, శివగళ్ల ప్రవీణ్, శివగళ్ళ సురేష్, చించేటి శివ, బొమ్మగల నరసింహులు, టైలర్ కృష్ణ, ఫార్మసిస్ట్ రాజశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ శివాని, సూపర్వైజర్ చంద్రకళ, ఏఎన్ఎం స్వరూప, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మోక్షధృతి నమోదు



ప్రశంసాపత్రం అందుకుంటున్న నృత్యకారిణి మోక్షధృతి

**ఘట్‌కేసర్, జనవరి 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన నృత్యకారిణి మోక్షధృతి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు అయ్యింది. హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్ వేదికగా సుమన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని శాస్త్రీయతతో పాటు భావవ్యక్తీకరణలోనూ అద్భుత ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులు, న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుంది. ఈసందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, జాతీయ పర్యావరణ ద్రోణాచార్య అవార్డు గ్రహీత-తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జ్యూరీ సభ్యులు టివి. అశోక్‌కుమార్ మోక్షధృతికి మెమెంటోతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నృత్యంలో ఆమె చూపిన క్రమశిక్షణ, లయ, భావప్రకటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని వారు ప్రశంసించారు. మోక్షధృతి భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ నిర్వహకులు అభినందనలఉ తెలియజేశారు. ఈకార్యక్రమంలో నాట్యగురువు ఝాన్సీ రామ్‌తో పాటు అకాడమీ ప్రతినిధులు, కళాభిమానులు పాల్గొని మోక్షధృతిని ఘనంగా సన్మానించారు.

## ఆక్రమించుకున్న రోడ్డు స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

**కీసర, జనవరి27, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లాలోని ఆద్రాస్‌పల్లి గ్రామంలోని సర్వే నంబరు 271 నుండి 283 వరకు ఉన్న స్థలంలో ఆక్రమించుకున్న రోడ్డు స్థలాన్ని సర్వే చేసి ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని మంగళవారం బిజేపి మండల ప్రధాన కార్యదర్శి నల్ల వెంకట్‌రెడ్డి ఆర్‌డిఓ రాజేష్‌కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే విషయమై జిల్లా అధికారులకు, జిల్లా కలెక్టరేట్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికి ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలు ఎన్ని నిర్వహించినా ఏమి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులకు జవాబుదారీ తనం ఎక్కడుందని ప్రశ్నించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చెబుతున్నా కింది స్థాయి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఆక్రమించుకున్న స్థలాన్ని సర్వే చేసి ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని ఆయన కోరారు.



ఆర్‌డిఓ రాజేష్‌కుమార్‌కి ఫిర్యాదు చేస్తున్న బిజెపి ప్రధాన కార్యదర్శి నల్ల వెంకట్‌రెడ్డి

## చుక్కపూర్‌లో బండలాగుడు పోటీలు

**తలకొండపల్లి ,జనవరి27,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండల్ చుక్కాపూర్ చుక్కా పూర్ గ్రామపంచాయతీలలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీ ్మ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండలాగుడు పోటీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చుక్కా పూర్ సర్పంచ్ మాకం వీరేశలింగం రెండో బహుమతి రూ. 17వేలు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్నమోని లావణ్య శ్రీను మొ దటి బహుమతి రూ.2500, రెండో బహు మతి రూ.1500, మూడో బహుమతి రూ. 1000 అందజేశారు, వార్డ్ మెంబర్లు శ్రీధర్ రెడ్డి,మొదటి బహుమతి రూ.25వేలు, శివుడు రూ.3వేలు, విష్ణు రూ.3వేలు, కలూరి మల్లేష్,రూ.2వేలు, వంగూరి మల్లేష్ రూ.2 వేలు, కంతం శివజోతి శేఖర్, రూ.3వేలు, గండికోట శ్రీకాంత్ రూ.2వేలు,మరియు చుక్కాపూర్ బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్నముని మల్లేష్, ఉపాధ్యక్షులు కలూరి మల్లేష్, రైతు గ్రామ కమిటీ అధ్యక్షుడు గుమ్మ కొండ మల్ రెడ్డి,గుడ్దేటి కృష్ణయ్య, బి రవి, మలేష్, రవి, నరేష్ రెడ్డి, మహేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదవ, సోదరులు మరియు చుక్కాపూర్, ఎడవల్లి, పాతకోట తండా, పడ మటి తండా సంగయ్య పల్లి, ఖానాపూర్, చెన్నారం, తలకొండపల్లి పరిసరాల ప్రాంతాల ప్రజలు హాజరై విజయవంతం చేయడం జరిగింది.



చుక్కాపూర్లో పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ వీరేశలింగం

## ప్రాధమిక పాఠశాలకు ఉచితంగా 60టేబుల్స్ పంపిణీ





పాల్గొన్న డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, తదితరుల దృశ్యం

..రాజబొల్లారం మోనార్క్ ఎర్గో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారి చేయూత

..విద్యార్థుల సంతోషం

..విద్యాభివృద్ధికి కార్పోరేట్ సంస్థల సహకారం అభినందనీయం

..మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్

**శామీర్‌పేట, జనవరి 27, ప్రభాతవార్త:** దేవరయాంజాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం రాజబొల్లారం మోనార్క్ ఎర్గో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు 60 టేబుల్స్‌ను ఉచితంగా అందజేశారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని దేవరయాంజాల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ఆ సంస్థ వారు 60టేబుల్స్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగ జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ పాల్గొని విద్యాభివృద్ధి కోసం కార్పోరేట్ సంస్థల వారు తమ సహకారాన్ని అందించటం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయటానికి కార్పోరేట్ సంస్థలు ముందుకు రావాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. అయితే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ పాఠశాలను సందర్శించగ విద్యార్థులకు సరిపోను టేబుల్స్ లేవని ఆయన దృష్టికి తీసుకరావటం, దీనికి ఆయన స్పందించి దాతల సహకారంతో టేబుల్స్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డికి సూచించినట్లు, దీంతో జైపాల్‌రెడ్డి వెంటనే నాగిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిల సహకారంతో రాజబొల్లారంలోని మోనార్క్ ఎర్గో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత కోటేశ్ జగన్నాదం తో మాట్లాడి పాఠశాలకు అవసరమైన 60టేబుల్స్ ఏర్పాటు చేయించటం జరిగిందని జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి వివరించారు. ఇ సంస్థ అధినేత కోటేశ్ జగన్నాథం మాట్లాడుతూ విద్యే సమాజాభివృద్ధికి పునాది అని, తాము సామాజిక బాధ్యతగ భావించి సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఈ సందర్భంగ టేబుల్స్‌ను డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, ఆ సంస్థ అధినేత కోటేశ్ జగన్నాధంలతో పలువురు నాయకులతో కలిసి విద్యార్థులకు టేబుల్స్‌ను పంపిణీ చేయటం జరిగిందని జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్ కట్ట మీనాకుమారి, దేవాలయ చైర్మన్ పి.లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ధర్మకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు కాంగ్రెస్ నాయకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలి

**మండల విద్యాధికారి వెంకట్**

**దోమ, జనవరి 27, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని దోమమండల విద్యాధికారి వెంకట్ అన్నారు .దోమ మండల పరిధిలోని కొండాయపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నాడు కొండాయపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి పాఠశాల విద్యార్థులకు 20 వేల రూపాయలతో స్పోర్ట్స్ దుస్తులు అందజేశారు. ఈ సందర్భముగ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరిపూర్ణ ఆధ్వర్యములో దుస్తులను అందజేయగా గ్రామస్తులు,పాఠశాల సిబ్బంది దుస్తులు అందించిన గోపాల్‌రెడ్డిని అభినందించి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, గ్రామ ఉసర్పంచ్ శిరిషప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి ప్రబాకర్, ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీకాంత్, పాఠశాల చైర్మెన్ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు అందిస్తున్న గోపాల్‌రెడ్డి.ఎంఇఓ వెంకట్



సమ్మక్క సారక్క తులిభారంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## వనదేవతల సేవలో..

## షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తులాభారంలో బెల్లం

**నందిగామ, జనవరి 27, ప్రభాతవార్త :** అడవి బిడ్డల ఆరాధ్య దైవం.. నమ్మి కొలిచే భక్తుల కొంగు బంగారమై. అశేష జనావళి చేత విశేషంగా పూజలు అందుకుంటున్న మానవ వనదేవతలు సమ్మక్క సారలక్కలకు షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తన అక్క మంత్రి సీతక్కగారి కోరిక మేరకు వనదేవతల జాతర మేడారంకు వెళ్లిన ఆయన తన బరువుతో సమానమైన 76 కేజీల బరువున్న బెల్లం తులాభారంతో మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే గారి వెంట నర్సప్పగూడ మాజీ సర్పంచ్ కావలి కృష్ణ , లింగారెడ్డిగూడెం అశోక్, సీతారాం, నాని, తుపాకుల శేఖర్, నవీన్, అంజి యాదవ్, దర్శన్, రానా ప్రతాప్, మహేందర్, శేఖర్ తదితరులు ఉన్నారు.

## రియల్టర్స్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా కమిటీ ఎన్నిక

**-జిల్లా సభ్యులుగా వెంకటేశ్, రాధాకృష్ణ**

**ఘట్‌కేసర్, జనవరి 27, ప్రభాతవార్త:** తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కమిటీని ఎంపిక చేశారు. మేడిపల్లిలోని సాయిప్రియకాలనీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నారగోని ప్రవీణ్‌కుమార్ హజరై జిల్లా నూతన కమిటీని నియమించారు. జిల్లా అధ్యక్షులుగా ఆర్.శ్రీశైలంతో పాటు 20 మంది సభ్యులను కమిటీలో ఎంపిక చేశారు. ఘట్‌కేసర్ డివిజన్‌కు చెందిన మెదబోయిన వెంకటేశ్ ముదిరాజ్, బర్ల రాధాకృష్ణ ముదిరాజ్‌లను జిల్లా కమిటటీ సభ్యులుగా నియమించారు. ఈసందర్భంగా జిల్లా కమిటీ కార్యవర్గాన్ని శాలువా, పూలదండలతో సన్మానించారు.



సభ్యులుగా ఎన్నికైన వెంకటేశ్, రాధాకృష్ణలను సన్మానిస్తున్న దృశ్యం



## అదుపుతప్పిన వాహనం ..తప్పిన పెను ప్రమాదం

**కేశంపేట, జనవరి 27, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామ సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కలో ఉన్న గుంతలోకి దూసుకు వెళ్లింది ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. కంకర పరిచి నెలలు గడుస్తున్న ఎవరు పట్టించుకోవడంలేదని గతంలో కూడా ఈ రోడ్డులో అనేక ప్రమాదాలు జరిగాయని రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డుపక్కలో ఉన్న పంటపొలాలలో దుమ్ముపేరుకుపోయి పంటనష్టాలు జరుగుతున్నాయని రోడ్డు పరిసర ప్రాంతాలలో ఉన్న రైతులు తెలిపారు. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి ఇకనైనా రోడ్డుపై బిటి రోడ్డు నిర్మించాలని ప్రయాణీకులు అంటున్నారు.



అధికారిని సన్మానిస్తున్న నాయకులు

## నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం ప్రశంసా పత్రాలు

**బిజెవైఎం అధికార ప్రతినిధి శివాజి**

**కేశంపేట, జనవరి 27, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలో నిబద్ధలతో పనిచేస్తున్న అధికారులకు ఉత్తమ ఉద్యోగులుగా కలెక్టర్ చేతుల మీదుగా గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ప్రశంసా పత్రాలు అందుకోవడం కేశంపేట మండలానికే గర్వకారణం అని బిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ అన్నారు. ఉత్తమ ఎంపిడిఒ రవిచంద్ర రెడ్డికి,ఎం పి ఓ కిష్టయ్యకు, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగిగా నిఖిల్ రెడ్డికి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అధికారులను ఎంపాడిఒ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయంలో వారికి శాలువాతో సన్మానించి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఇంకా ఉన్నత సాయిధికి ఎదగలని మరెన్నో అవార్డులు తీసుకోవాలని సహోద్యోగులకు ఆదర్శంగా నిలువాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ .బిజెపి సీనియర్ నాయకులు యుగంధర్.మహేష్.శివగౌడ్ .శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



రైటప్: విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, నోటు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ సులోచనా శ్రీనివాస్,తదితరులు

## విద్యతోనే భవిష్యత్తు బంగారం

**: లేమామిడి సర్పంచ్ సులోచనా శ్రీనివాస్**

**కేశంపేట, జనవరి 27, ప్రభాతవార్త :** భవిష్యత్తు బంగారంలా ఉండాలి అంటే అది విద్య ద్వారానే సాధ్యమవుతుందని విద్యార్థి దశలోనే క్రమశిక్షణను అలవర్చుకోవాలని విద్యార్థులు చిన్నతనం నుంచే ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని లేమామిడి గ్రామ సర్పంచ్ సులోచన శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామ 5వ వార్డు సభ్యుడు దిద్దెల సురేందర్ ఆర్థిక సహాయంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, నోటు పుస్తకాలను అందజేసి విద్యార్థులను ప్రోత్సహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం గల ఉపాధ్యాయులచేత విద్యాబోధన కొనసాగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. పాఠశాల ప్రగతికోసం కావాల్సిన సహాయసహకారాలు అందించేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, నోటు పుస్తకాలను అందజేసిన వార్డు సభ్యులు దిద్దెల సురేందర్ ను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధికి మరింత మంది దాతలు ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయురాలు పూజ, లావణ్య, గ్రామస్తులు బి.రమేష్, కుమార్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న సర్పంచ్,తదితరులు

**కేశంపేట, జనవరి 27, ప్రభాతవార్త :** కేశంపేట మండల కేంద్రంలో ధవళగిరి గుట్టపై స్వయంభుగా వెలసిన శ్రీశ్రీశ్రీ అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల గోడపత్రికను కేశంపేట గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామ్మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి ఉపాధ్యక్షులు పిల్లి అమరేష్ మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ కాట్రావత్ రాజు వార్డు సభ్యులు, గ్రామ యువజన సంఘాల సభ్యులు యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ, నర్సరీ పనులను పరిశీలించిన ఎంపిడిఒ

**కేశంపేట, జనవరి 27, ప్రభాతవార్త :** మహాత్మాగాంధీ జాతీయఉపాధిహామీ పనులను ప్రభుత్వ సూచనల ప్రకారం నర్సరీల నిర్వహణ పద్ధతులను పాటించాలని ఎంపిడిఒ రంజిత కుమార్ రెడ్డి అన్నారు. కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో గ్రామ సర్పంచ్ బీసా కవిత కరుణాకర్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ రవిచంద్ర కుమార్ రెడ్డి నర్సరి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఎన్ఆర్ఇజిఎస్ పనులపై రైతులు, కూలీలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు .ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. పనులనాణ్యతపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఎంపిడిఒ తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి అవినాష్ గౌడ్, ఉప సర్పంచ్ రవి నాయక్, వార్డు సభ్యులు పొగుల నర్సింలు, పోగుల నరేష్, లచ్చి రామ్ నాయక్, కావలి వసంత, చాపల కృష్ణమ్మ, కందెన సంతోష, లాలమెని మల్లేష్, ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు కల్వకోల్ నిరంజన్, కుమ్మరి శేఖర్, బుచ్చిరెడ్డి జంగయ్య, అంజమ్మ, అరుణమ్మ, మాసమ్మ తదితరులు పాల్గొన్నారు.





## విశ్వవిశ్వాని కళాశాలలో అరైవ్..అలైవ్ కార్యక్రమం

**శామీర్‌పేట, జనవరి 27, ప్రభాతవార్త:** తూంకుంటలోని విశ్వవిశ్వాని కళాశాలలో రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్..అలైవ్ కార్యక్రమాన్ని పోలీసు, ట్రాఫిక్ పోలీసు అధికారులు విద్యార్థులతో, వాహనదారులతో కలిసి నిర్వహించారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని విశ్వవిశ్వాని కళాశాలలో అరైవ్..అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రతపై వాహనదారులకు, విద్యార్థులకు నియమాలను, సూచనలను, సలహాలు తెలియజేశారు. బేగంపేట్ ట్రాఫిక్ ఎసిపి శంకర్‌రాజు పర్యవేక్షణలో అల్వాల్ ట్రాఫిక్ సిఐ శంకరయ్య, శామీర్‌పేట సిఐ శ్రీనాథ్,ట్రాఫిక్ ఎస్ఐ నవీన్‌రెడ్డి, ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి, వారితో పాటు విశ్వవిశ్వాని కాలేజ్ గ్రూప్స్ డైరెక్టర్ రామకృష్ణ చిన్నం, సిబ్బంది, విద్యార్థులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న సర్పంచ్ కొమ్ము కృష్ణ.

## సన్న బువ్వ తినుండ్రి.. చక్కగా చదువుండ్రి

**మధ్యాహ్నం భోజనం పరిశీలించిన సర్పంచ్**

**నందిగామ, జనవరి 27,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందని, నాణ్యమైన భోజనం అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ మధ్యాహ్నం భోజనం వడ్డించే నిర్వాహకులకు సూచించారు. మంగళవారం నందిగామ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఎఎంసి డైరెక్టర్ చాకలి నరసింహ, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్ ,శివ కుమార్, బొమ్మగల నరసింహులు,మాజీ ఎంపిటిసి కుమార్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పిట్టల రాములు, జంగయ్య గౌడ్, అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మారుమోగిన శివనామస్మరణ



భజన సంకీర్తనలు ఆలపిస్తున్న శివస్వాములు

**దుద్యాల్, జనవరి 27, ప్రభాతవార్త :** మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలోని పెరుమాల్లు అంజనేయ స్వామి దేవాలయంలో శివ స్వాముల పడిపూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీంతో గ్రామంలో శివనామస్మరణ మారుమ్రోగాయి. స్వామి వారికి పంచామృతాభిషేకం, బిల్వష్టం, శివాష్టకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శివ స్వాములు భజన పాటలతో గ్రామంలో భక్తి పరవశం నెలకొంది. గ్రామానికి చెందిన శివస్వాములతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

## శివనామస్మరణతో మార్మోగిన సోలిపేట్



**షాబాద్, జనవరి 27, ప్రభాతవార్త :** హరహర మహాదేవ అంటూ సోలిపేట్ గ్రామం శివనామస్మరణతో మారుమ్రోగింది. సాబాద్ మండల పరిధిలో సోలిపేట్‌గ్రామంలో మంగళవారం శేఖర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో శివయ్య పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వాములు పాడిన పాటలకు భక్తులు మంత్రముగ్దులయ్యారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు నరేందర్, శివస్వాములు పాల్గొన్నారు.

## చిట్లపల్లిలో మెడికల్ క్యాంపు నిర్వహణ

**కొడంగల్,జనవరి 27,ప్రభాతవార్త:** వికారాబాద్‌జిల్లా కొడంగల్ మండలం చిట్లపల్లి గ్రామంలో మంగళవారంరోజు ఓఎమ్ఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు.గ్రామంలోని జోగిని మహిళలు,ఒంటరి మహి ళలు,దళిత మహిళలు,చిన్నారులు వారి యొక్క అనారోగ్య సమస్యల గురించి వచ్చి హెల్త్ చెక్ అప్ చేయించుకోవడం జరిగిందని,153 మంది మహిళలు పాల్గొనడం జరిగిందని వైద్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓఎమ్ఐఎఫ్ స్టేట్ టీం శాంసన్,డాక్టర్ పృథ్వీ రాజ్,జిల్లా కోఆర్డినేటర్ నారా యణ,పంచాయితీ కార్యదర్శి,సర్పంచ్,మండల కోఆర్డినేటర్ ఈశ్వప్ప,కృష్ణ హెల్త్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



క్యాంపులో పాల్గొన్న చిన్నారులు

## ఉత్తమ తహసీల్దార్ అన్వర్

**షాబాద్, జనవరి 27, ప్రభాతవార్త :** ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు తీసుకున్న షాబాద్ తహసీల్దార్ అన్వర్‌ను మంగళవారం షాబాద్ సర్పంచ్ గుండాల అశోక్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య నాయకులతో కలిగి ఘనంగా సన్మానించారు. పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గర్ డైరెక్టర్ అక్తర్ పాషా, కృష్ణగుప్తా, రమేష్, రామస్వామి, శివ, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ అన్వర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ అశోక్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య

## అమ్మవారి చీరల బహిరంగవేలం

**ఘట్‌కేసర్, జనవరి 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ శ్రీగట్టుమైసమ్మగుట్ట దేవాలయంలో అమ్మవారి చీరలను వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ ఎల్.భాగ్యలక్ష్మి తెలిపారు. శ్రీగట్టుమైసమ్మ అమ్మవారికి భక్తుల నుంచి కానుకలుగా వచ్చిన చీరెలను అమ్మవారికి అలంకరించి తీసిన చీరెలు నాలుగు ఆదివారాలు వేలం వేస్తామని తెలిపారు. ఈనెల 25న వేలం వేస్తామని, ఫిబ్రవరి 1, 8, 22 తేదీలలో ఉదయం 10:30 గంటలకు బహిరంగ వేలం ద్వారా దేవస్థాన ప్రాంగణంలో విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కల్గిన భక్తులు ఇంకా మూడు వారాల పాటు వేలంలో పాల్గొని అమ్మవారి చీరెలను పొందవచ్చని ఈఓ భాగ్యలక్ష్మి సూచించారు.

# ఆంజనేయస్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

**షాద్ నగర్, జనవరి 27, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం మధ్వనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

శ్రీ మధ్వనవమిని పురస్కరించుకొని దేవాలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య ఆధ్వర్యంలో దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకం, ఆకు పూజ, మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. షాద్నగర్ విష్ణు సహస్ర పారాయణ మండలి ఆధ్వర్యంలో దేవాలయ ఆవరణలో గీతా పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

స్వామి వారికి పల్లకిసేవతో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు రఘుపతిరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ నవమి రోజున మధ్వనవమి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. వాయుదేవుడే మధ్వాచార్యులుగా అవతరించాడని, మధ్వాచార్యుల యొక్క గొప్పతనాన్ని విశిష్టతను భక్తులకు వివరించారు.

ఈ ఊరేగింపులో భక్తుల ఆటపాటలు భజనలతో దేవాలయం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. అదేవిధంగా నారాయణపేట కొల్లూరుకు చెందిన కర్ణాటక సంగీత భజనమండలి సభ్యుల గీతాలాపనలతో భక్తులు ద్వైత సిద్ధాంతకర్తను స్మరించుకున్నారు. అనంతరం బ్రాహ్మణులకు, భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యంసాని నర్సింలు, వీర్లపల్లి కృష్ణయ్య, ప్రవీణ్ యాదవ్, యాదగిరి, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, గోరియా నాయక్, లింగమయ్య భజన మండలి సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏళ్లనాటి కల ఫలించిన వేళ

# హైస్కూల్ స్లాబ్ నిర్మాణానికి శ్రీకారం

**స్లాబ్ పనులను ప్రారంభించిన సర్పంచ్**

**నందిగామ, జనవరి 27, ప్రభాతవార్త:** చదువు ద్వారానే ప్రపంచాన్ని జయించవచ్చన్న దృఢ సంకల్పంతో తాను విద్యాబుద్ధులు నేర్చుకున్న చదువులమ్మ.. సరస్వతీ ఒడిలో విద్యాసుగంధాలను వెదజల్లేందుకు సుమారు రూ.2 కోట్ల పైచిలుకు నిధులు మంజూరు చేయించి హైస్కూల్ నిర్మాణ భవనానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చరిత్రలో మిగిలిపోనున్నారు. మంగళవారం నందిగామ మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణ స్లాబ్ పనులకు సర్పంచ్ కొమ్ము కృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల నిర్మాణం నాణ్యత ప్రమాణాలకు ప్రాధాన్యతనిచ్చి అన్ని హంగులతో.. కార్పొరేట్ స్థాయి తీసిపోని రీతిలో నిర్మిస్తున్న ప్రగతికి కేరాఫ్ అడ్రస్ , ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్‌కి నందిగామ ప్రజలు, విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.. ఈ పూజల్లో ఎఎంసి డైరెక్టర్ సి నర్సింలు, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, మాజీ ఎంపీటీసీలు కుమార్ గౌడ్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిట్టల రాములు, నాయకులు బి జంగయ్య గౌడ్ , అగ్గి జంగయ్య గౌడ్ , రాఘవేందర్ చారి ,వార్డు సభ్యులు అగ్గి ప్రసాద్, అగ్గి మమత సూరి, శివగళ్ల ప్రవీణ్, చించేటి లత శివ, శివగళ్ల సురేష్, బొమ్మగల నర్సింలు, టైలర్ కృష్ణ, కిట్టు, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో హైస్కూల్ నూతన బిల్డింగ్ నిర్మాణం కోసం స్లాబ్ కు పూజలు చేస్తున్న సర్పంచ్ కొమ్ము కృష్ణ

# ఘట్టుమైసమ్మ హుండీ ఆదాయం రూ.1,77,581 లు

**ఘట్‌కేసర్, జనవరి 27, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో శ్రీఘట్టుమైసమ్మ జాతర సందర్భంగా హుండీ ద్వారా అమ్మవారికి రూ.1,77,581లు ఆదాయం వచ్చింది. ఘట్టుమైసమ్మగుట్ట దేవస్థానం ఆవరణలో మంగళవారం దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఆలయ ఈఓ ఎల్.భాగ్యలక్ష్మి, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు, మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సమక్షంలో హుండీ లెక్కింపు జరిపారు. ఆదివారం జరిగిన అమ్మవారి జాతర సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆలయ ఆవరణలో పలు చోట్ల ఏర్పాటు చేసిన హుండీలలో డబ్బుల రూపేణా కానుకలు సమర్పించుకున్నారు. దేవాదాయ సిబ్బంది హుండీలలో భక్తుల నుంచి వచ్చిన డబ్బులను లెక్కించగా రూ.1,77,581లు ఆదాయం వచ్చినట్లు ఈఓ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు బర్ల దేవేందర్, బొక్క జంగారెడ్డి, కడుపొల్ల హేమలత సుధాకర్, పొట్లచెరువు నాగరాజు, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, కొరుబోతు నాగరాజు, కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు కెవెల్‌జి ప్రసాద్, బొక్క సత్తిరెడ్డి, మోత్కుపల్లి శ్రీనివాస్, రాజు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఘట్టుమైసమ్మ అమ్మవారి హుండీ లెక్కిస్తున్న దృశ్యం

# ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి దాతల సహకారం అవసరం

**షాబాద్, జనవరి 27, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి దాతల సహకారం అవసరమని ముద్దెంగూడ సర్పంచ్ సర్వేద నర్సింహులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముద్దెంగూడ ప్రాథమికోన్నత పాఠశాలకు కురుమ సంఘం అధ్యక్షుడు వించెటి శంకర్ రూ. 1లక్ష విలువ చేసే విద్యార్థులకు కుర్చీలు, ఆట వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేసి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలలో ఇంటర్, డిగ్రీ చదివిన వారే విద్యను బోధిస్తారని, ప్రభుత్వ పాఠశాలల్లో బీఈడీ చదివిన వారు బోధిస్తారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఇంత గొప్ప మనసున్న దాత చించెటి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివకుమార్ మాజీ ఎంపిపి కూర వెంకటయ్య, మాజీ సర్పంచులు భూపతి రాజు, కుర్వ జయమ్మ సుదర్శన్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, వారు సభ్యులు, యువజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.



ముద్దెంగూడ పాఠశాలకు బెంచీలు, ఆటవస్తువులను అండజేస్తున్న కురుమ సంఘం అధ్యక్షుడు శంకర్

# ఏకగ్రీవంగా ఎన్నుకుందాం..కలిసి రండి అంటూ పిలుపు



అద్రాస్‌పల్లిలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి,పాల్గొన్ననాయకుల దృశ్యం

**..మాజీ మంత్రి,మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి**

**శామీర్‌పేట, జనవరి 27, ప్రభాతవార్త:** అద్రాస్‌పల్లి గ్రామాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని, ఈ మున్సిపల్ ఎన్నికల్లో గ్రామం నుంచి వార్డులకు ఏకగ్రీవంగా ఎన్నుకోవటానికి అన్ని పార్టీల వారు ముందుకు రావాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని అద్రాస్‌పల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగ మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ అద్రాస్‌పల్లి గ్రామంలో గత ఎన్నికలకు ముందే పలు సిసి రోడ్లు, దేవాలయాల నిర్మాణం పనులు చేపట్టినట్లు, గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయటానికి దాత ముందుకు వస్తున్నారని గ్రామాన్ని సుమారు కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేసుకుందామని అన్ని పార్టీల వారు సహకరించాలని, వార్డులకు కౌన్సిలర్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవటానికి కలిసి రావాలని మల్లారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపాల్టీ బిఆర్ఎస్ అధ్యక్షులు జి.మల్లేశ్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకులు టి.అనిల్‌రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి,రమేష్, నర్సింలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఘట్టుమైసమ్మగుట్ట ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

**ఘట్‌కేసర్, జనవరి 27, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి ఘట్‌కేసర్ ఘట్టుమైసమ్మగుట్ట దేవాలయ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం మంగళవారం జరిగింది. కొండపైన అమ్మవారి ప్రాంగణంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ నూతన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రమాణ స్వీకారంలో పాల్గొని ట్రస్ట్ బోర్డు సభ్యులకు ఆలయ అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. ఘట్టుమైసమ్మగుట్ట ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా బర్ల దేవేందర్ (ఇడబ్ల్యుఎస్‌కాలనీ), బొక్క జంగారెడ్డి (బొక్కోనిగూడ), కడుపొల్ల హేమలత సుధాకర్ (అంబేద్కర్‌నగర్), పొట్లచెరువు నాగరాజు (ఎస్ఆర్‌నగర్), ఎక్స్ఆఫిసియో సభ్యులుగా అర్చకులు ఎం.నరేశ్‌లను దేవాదాయశాఖ కమీషనర్ నియమించడంతో వారు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా సభ్యులను శాలువా, పూలదండలతో సన్మానించారు. గత నెలలోనే ట్రస్ట్‌బోర్డు సభ్యుల ఎంపిక పూర్తయినప్పటికి జాతర అనంతరం నలుగురితో ప్రమాణ స్వీకారం చేయించడం చర్చనీయమైంది. ఇతర దేవాలయాల్లో సభ్యులను నియమించి ఉత్సవాల కంటే ముందుగానే బాధ్యతలు అప్పగిస్తుండగా ఇక్కడ మాత్రం అందుకు బిన్నంగా జాతర పూర్తయిన తర్వాత ప్రమాణం చేయించడం గమనార్హం. ఈకార్యక్రమంలలో ఈఓ శ్రీకాంత్, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, ఆర్‌టిఏ బోర్డుసభ్యులు బీమిడి జైపాల్‌రెడ్డి, కీసరగుట్ట డైరెక్టర్ సగ్గు అనిత శ్రీనివాస్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిల్కూరి మచ్చేందర్‌రెడ్డి, కొమురవెల్లి ఉత్సవ సభ్యులు మెరుగు నరేశగౌడ్, మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, సొసైటీ మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, రజక సంఘం ఉపాధ్యక్షులు గొల్లపల్లి అంజనేయులు, నాయకులు మోత్కుపల్లి శ్రీనివాస్, వాకిటి ప్రవీణ్‌రెడ్డి, బొక్క సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీఘట్టుమైసమ్మగుట్ట ఆలయ పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, పాల్గొన్న డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ తదితరులు



## రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న జవహర్‌నగర్ ఎసిపి

**కీసర,జనవరి27,ప్రభాతవార్త:** తెలంగాణాలోనే సుప్రసిద్ద శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామిని మంగళవారం జవహర్‌నగర్ నూతన ఏసిపిగా చక్రపాణిబాధ్యతలు తీసుకున్న సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ చైర్మన్ తటాకం వెంకటేశ్‌శర్మ ఆయనకి శాలువాతో సన్మానించి,స్వామివారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కీసర సిఐ ఆర్కపల్లి ఆంజనేయులు,జవహర్‌నగర్ ట్రాఫిక్ సిఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కీసరలో కరెంటు నిలిపివేత

**కీసర,జనవరి27,ప్రభాతవార్త:** ఫీడర్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా సంబందిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కీసర విద్యుత్ ఏఈ మురళీక్రిష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 కెవి కీసర సబ్‌స్టేషన్‌లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కీసర గ్రామంలోని ఎస్సీ కాలనీ,రెడ్డి కాలనీ, శివాజీనగర్,సిద్దార్థ నగర్,మల్లిఖార్జున నగర్,సెరినిటీ స్కూల్,11 కెవి చీర్యాల గ్రామంలోని లక్ష్మీ ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కుందన్‌పల్లి,వికలాంగుల కాలనీ,వర్దనా స్కూల్,గోదుమకుంట,11 కెవి వర్దనా ఫీడర్ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కుందన్‌పల్లి ఏజిఎల్,గోధుమకుంటఎజిఎల్,11 కెవి అంకిరెడ్డిపల్లిలో అంకిరెడ్డి పల్లి,శివాజీనగర్,కీసరగుట్టరోడ్డు,సినిమా థియేటర్,మల్లిఖార్జున నగర్,విఆర్ఆర్ వెంచర్,లలిత ఫంక్షన్‌హల్,రిజిస్టార్ కార్యాలయం,చంద్రగిరి కాలనీ,కీసర,11 కెవి పాత కలెక్టర్ కార్యాలయం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నూకలగూడెం,రెడ్డి గూడెం,కీసరగుట్ట పాదాల రోడ్డు,11 కెవి బోగారం ఫీడర్‌లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు వెంకట్‌రెడ్డి నగర్,రెడ్డిగూడెం,పిఎన్ఆర్ కాలనీ,హెచ్‌పి పెట్రోల్ బంక్,మేఘనా ఫంక్షన్‌హల్,11 కెవి రాంపల్లిదాయర మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కీసర దాయర గ్రామం,రాంపల్లిదాయర.11 కెవి కరీంగూడలో జాఫర్‌గూడ,తుర్క దాయర,బాలవికాస,దాయర గ్రామం,11 కెవి బర్గిగూడ మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బర్గిగూడ,చిత్తారమ్మ ఆలయం,జ్ఞానం,లాంగ్ సర్వీస్,మెయిన్ రోడ్డు,11 కెవి వన్నిగూడలో ఇండస్ట్రీయల్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బోగారం,బర్గిగూడ,మణి ఇంజినీరింగ్,హోలీమేరీ కళాశాల,డబుల్ బెడ్‌రూం,శ్రీ నిధి వెంచర్,కెజిఆర్ ఫంక్షన్ హల్,సత్తిరెడ్డి క్రషర్,క్రషర్ కంపెనీలో తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## దివ్యాంగులకు అండగా కాంగ్రెస్



ట్రై సకిళ్ళను పంపిణీ చేస్తున్న సర్పంచ్ లాలప్ప

**దుద్యాల్, జనవరి 27, ప్రభాతవార్త :** ప్రభుత్వం దివ్యాంగులు సంక్షేమానికి కట్టుబడి ఉందని కుదురుమల్ల గ్రామ సర్పంచ్ లాలప్ప అన్నారు. మంగళవారం గ్రామానికి చెందిన బల్సురండ సాయిలు అనే దివ్యాంగులుడికి ట్రై స్యూటీని గ్రామస్తులతో కాలిసి అందించారు. ఈ సందర్వంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు అన్ని విదాలుగా అండగా నిలుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. సంక్షేమ పథకాలు ర్హులైన వారికి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాంబండ రామలింగేశ్వర స్వామి అలయ అభివృద్ధికి కృషి

**పరిగి,జనవరి 27, ప్రభాతవార్త:** పాంబండ రామలింగేశ్వర స్వామి అలయ అభివృద్దికి నిరంతం కృషి చేస్తామని ఆలయ ఛైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, ఏఎంసి ఛైర్మన్ ఆంజనేయులు అన్నారుమండల బండవేల్కిచర్ల రామలింగేశ్వర స్వామి అలయ గిరి ప్రదక్షణకు రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం రోడ్డు పనులను పరిశీలించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆలయల అభివృద్దికి ఎంతో కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి గోపాల్ నాయక్, సినియర్ నాయకులు వెంకట్, బాలకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారత కమ్యూనిస్టు పార్టీలో చేరికలు

**మున్సిపల్ ఎన్నికలలో 17వ వార్డు నుండి పోటీ : సిపిఐ పార్టీ**

**చేవెళ్ల, జనవరి 27, ప్రభాతవార్త :** చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిరుపేదల కోసం కార్మికుల కోసం కర్షకుల కోసం బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పేదల పక్షాన పోరాటాలు చూసి సిపిఐ పార్టీలో ఈరోజు చేవెళ్ల ప్రాంతానికి చెందిన సాల్రా వెంకటేష్ పరివేద సత్యం కుక్కుడాల వెంకటేష్ తదితరులు భారత కమ్యూనిస్టు పార్టీలో చేరినారు వీరికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నియోజకవర్గం ఇన్చార్జి కె రామస్వామి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభు లింగం జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ కలిసి వారికి సిపిఐ పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో 17వ వార్డు నుండి సాల్రా వెంకటేశు రెండు డెక్ లేరా సిపిఐ పార్టీ నుండి పోటీలో పోటీలో ఉంటారని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి ఎన్ఎఫ్ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల ఒగ్గు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు .

